క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పెన్‌పహాడ్ : అనాజిపురం గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన ఫిజిక్స్ బోధించుటకు అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ కోడి లింగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ బీఈడీ అర్హత కలిగిన వారు ఈ నెల 13వ తేదీ వరకు స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 9989636205 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుమలగిరి : మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ గౌస్, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

తుంగతుర్తి : నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సైదులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ దగ్గర ఉన్న ఎరువులు, విత్తనాల వివరాల స్టాక్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని షాపుల యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీ రాంబాబు, ఏడీఏ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

తాళ్లగడ్డ : పార్టీకి కంకణబద్ధులై పనిచేయాలని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా పార్టీ పట్టణ కార్యాలయంలో సలిగంటి వీరేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం సంకినేని అరుణ్‌రావు, వరుణ్‌రావుల ఆధ్వర్యంలో ఆలేటి అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పల్స మల్సూర్ గౌడ్, పగిళ్ల సునిందర్ రెడ్డి, కె.కార్తీక్ రెడ్డి, జి.ఉమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషిచేయాలి

మద్దిరాల : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ కాట్ల రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆయా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యునిఫామ్ పంపిణీ చేశారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ బి. బాలునాయక్ కోరారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం మండలంలోని హెచ్‌ఎంలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, పాఠశాలల పారిశుద్ధ్య సిబ్బందికి నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో హెచ్‌ఎంలు బి. శేఖర్, పి.నర్సింహాచారి, జి.గోవర్ధన్‌రెడ్డి, ఆర్‌పీ ఆర్.సృజన, సీసీహెచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలకు..

బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాసర్లపహాడ్ గ్రామంలో జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు భూపతి శ్రీనివాస్‌గౌడ్ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే ఆరుగురు విద్యార్థులను తల్లిదండ్రులకు నచ్చజెప్పి తమ పాఠశాలలో చేర్పించుకున్నారు. అలాగే ఇంటింటి ప్రచారం జరిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఇ. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దబ్బేటి యాదగిరి, డి. యల్లయ్య, పుష్పలత, సీమ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పెన్‌పహాడ్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ, బాలరక్ష భవన్ ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి బయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, ఏఎస్ఐ రాములు, పీహెచ్ఎన్ శశిరేఖ, ఏపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సోమన్న, సీఆర్పీఎఫ్ డివిజన్ కన్వీనర్ గజ్జల ధర్మారెడ్డి, సీఆర్పీఎఫ్‌లు నాగు, సైదయ్య, ఆశా కార్యకర్త కవిత, అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



ఆత్మకూరులోని రైతువేదికలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



ఆత్మకూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



రైతుకు రశీదు అందిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

ఆత్మకూర్(ఎస్) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు చేయాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ప్రసవాల వివరాలను ఏఎన్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. ప్రసవాలకు దగ్గరలో ఉన్న పేషంట్ల వివరాలు ఎస్‌ఎంల వద్ద ఉంచుకొని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, పీహెచ్‌సీలోనే సాధారణ ప్రసవాలు నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీలో స్టాక్‌బాక్సులు అడ్డదిడ్డంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్ వెంటనే స్టోర్ రూమ్‌కు మార్చాలని ఆదేశించారు. తప్పనిసరిగా సమయపాలన పాటించాలని అన్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మండల వైద్యాధికారి మౌనికను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరుగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ భూసమస్యల పరిష్కారం కోసం రైతులు రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు ఇచ్చిన అనంతరం తప్పనిసరిగా రసీదులు పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ హాసిం, ఏఓ దివ్య, ఆర్ఐ ప్రదీప్, జూనియర్ అసిస్టెంట్ అజయ్, సుధాకర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి వచ్చేదెప్పుడో..



నిరుపయోగంగా ఉన్న డైనింగ్‌హాల్



తుప్పుపడుతున్న టేబుల్స్, సామగ్రి

అర్వపల్లి : మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 2023–24 విద్యా సంవత్సరంలో సుమారు రూ.14లక్షలతో డైనింగ్‌హాల్ నిర్మాణం చేపట్టారు. ఈ హాల్‌లో పిల్లలు భోజనాలు చేయడానికి స్టీల్ టేబుల్స్, బల్లాలు, ఇతర సామగ్రి కూడా తెచ్చారు. కానీ ఇంతవరకు వినియోగంలోకి రాలేదు. దీంతో పాఠశాలలోని 350 విద్యార్థులు ప్రతిరోజు చెట్ల కిందనే మధ్యాహ్న భోజనాన్ని నేలపై కూర్చొని చేస్తున్నారు. అయితే ఈ భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు ఇంత వరకు బిల్లు రాకపోవడంతో ప్రభుత్వానికి స్వాధీన పర్చలేదు. దీంతో ఈ డైనింగ్‌హాల్ అప్పటి నుంచి నిరుపయోగంగా మారింది.

గీత కార్మికుడికి గాయాలు

తాళ్లగడ్డ (సూర్యాపేట): తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట మండల పరిధిలోని తాళ్ల ఖమ్మంపహాడ్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్ల ఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు యల్క సైదులు కల్లు గీసేందుకు గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కగా.. ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని సైదులు భార్య సులోచన కోరుతోంది.

కొరవడిన వసతులు.. రోగులకు తిప్పలు

- కనీస సౌకర్యాలకు నోచుకోని అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- కూర్చునేందుకు బల్లాలు లేక ప్రజలకు ఇబ్బందులు



అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అర్వపల్లి : అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతోంది. కానీ ఆస్పత్రిలో కనీస వసతులు లేకపోవడంతో రోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఈ ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లే రోగులకు కూర్చోడానికి కనీసం బల్లాలు, కుర్చీలు కూడా లేవు. నిలబడే వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. శాలిగౌరారం, నాగారం, తుంగతుర్తి తదితర మండలాల ప్రజలకు దగ్గర కావడంతో ఎక్కువమంది అర్వపల్లి పీహెచ్‌సీకే వస్తుంటారు. కానీ కనీస వసతులు లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో గదులు, ఓపీ ఇతర ప్రదేశాల్లో కలిపి మొత్తం 12 ఫ్యాన్లు ఉన్నాయి. అయితే వాటిలో కేవలం నాలుగు ఫ్యాన్లు మాత్రమే పనిచేస్తున్నాయ. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆస్పత్రిలో రోగులు కూర్చునేందుకు బల్లాలు, కుర్చీలు సమకూర్చాలని, ఫ్యాన్లు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫ్యాన్లు పనిచేయడంలేదు



ఇటీవల ఎండలతో అనారోగ్యానికి గురై అర్వపల్లిలోని ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లాను. అయితే గ్లూకోజ్ ఎక్కించుకోవడానికి వార్డుకు వెళ్లగా ఫ్యాన్లు పనిచేయక ఉక్కపోతతో ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఆస్పత్రిలో ఉండలేక స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి గ్లూకోజ్ పెట్టించుకున్నాను. ఆస్పత్రిలోని ఏ ఒక్క గదిలోనూ ఫ్యాన్లు పనిచేయడం లేదు.

– దడిపల్లి వెంకట్, సామాజిక కార్యకర్త

పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలి

చివ్వెంల : పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని భారత వికలాంగ హక్కుల పరిరక్షణ సమితి(బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గుంపుల గ్రామంలో నిర్వహించిన ఆ సంఘం గ్రామ కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి వర్గంలో కూడా వికలాంగులకు అవకాశం కల్పించాలన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వికలాంగులకు మంత్రి వర్గంలో అవకాశం కల్పించకపోవడం బాధాకరమన్నారు. వికలాంగులను కేవలం ఓటు బ్యాంకుగానే వినియోగించుకుంటున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.6వేల పెన్షన్ ఇస్తామని, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని, వికలాంగ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి ఈదయ్య బాబు, ఉప్పునూతల నర్సయ్య, మున్న మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించి ఆరోగ్యంగా జీవించండి



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేట అర్బన్ : ప్లాస్టిక్‌ను నిషేధించి క్యాన్సర్ లాంటి మహమ్మారి దరిచేరకుండా ఆరోగ్యంగా జీవించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 9వ వార్డు సైనికపురి కాలనీలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పించేందుకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలిని సూచించారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు తమ పరిసరాలు, మురుగు కాలువలు, రోడ్లపై చెత్త వేయొద్దని పట్టణ వాసులకు సూచిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వార్డుకు నీటిని సరఫరా చేసే పైపు నుంచి నీటిని తీసుకొని క్లోరినేషన్ టెస్టింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, వార్డు అధికారి సైదానాయక్, సయ్యద్ సమ్మి, టీఎంసీ శ్వేత, గుండు నాగరాజు, జవాన్ ఖమ్రు, కందిమళ్ల శేఖర్ మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య, నీటి సరఫరా సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

తిరుమలగిరి : వంద రోజుల ప్రణాళికలో భాగంగా తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో తడి, పొడి చెత్త వేరు చేయుట, హోమ్ కంపోస్టింగ్ తయారు చేసుకునే విధానంపై మున్సిపల్ అధికారులు మంగళవారం ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్, సూపరింటెండెంట్ రాజేశం, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

భూభారతితో రైతుల సమస్యలకు పరిష్కారం



నాగారం : పస్తాలలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ హరికిషోర్‌శర్మ

ఆత్మకూర్ (ఎస్) : భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. మంగళవారం నశింపేట, ఆత్మకూర్ గ్రామాలలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాలలో రెవెన్యూ సదస్సులకు భారీ స్పందన వస్తుందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఆర్ఐ ప్రదీప్ రెడ్డి, ఎంఆర్ఐ స్వప్న పాల్గొన్నారు.

అర్వపల్లి : రైతులు అపరిష్కృతంగా ఉన్న తమ భూ సమస్యలను భూభారతి సదస్సులలో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శ్రీకాంత్ కోరారు. మండలంలోని సూర్యనాయక్‌తండా, జాజిరెడ్డిగూడెం, కోమటిపల్లి, తదితర గ్రామాల్లో మంగళవారం సదస్సులు నిర్వహించి రైతుల నుంచి 182 దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సీహెచ్.యాదగిరి, సీనియర్ అసిస్టెంట్ పెరుమాళ్ల ప్రసన్న, గిర్దావర్‌లు జలేందర్‌రావు, పాటి వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి, మామిడాల గ్రామాలలో మంగళవార భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరిప్రసాద్ మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో తగిన ఆధారాలతో రైతులు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, మండల ప్రత్యేక అధికారి నర్సింహారావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భీమ్‌సింగ్ పాల్గొన్నారు.

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ హరికిశోర్ శర్మ అన్నారు. మంగళవారం పస్తాల గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. అనంతరం రైతుల నుంచి 190 దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఆర్ఐ అల్లావుద్దీన్, ఎంపీఎస్ఓ చింతమల్ల రమేష్, సీనియర్ అసిస్టెంట్ షఫీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : భూభారతి ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కంఠమయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చందుపట్ల, గుమ్మడవెల్లి గ్రామాలలో భూ భారతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రైతులను నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చివ్వెంల : రైతుల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ ప్రకాష్‌రావు అన్నారు. మంగళవారం లక్ష్మణ్‌నాయక్‌తండా, వట్టిఖమ్మంపహాడ్, దురాజ్‌పల్లి గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 325 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రావణి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : భూభారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లాలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు గాజులమల్కాపురం గ్రామంలో భూభారతి సదస్సులను నిర్వహించారు. పెన్‌పహాడ్‌లో 50, గాజులమల్కాపురంలో 78 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాధా, ఆర్ఐలు రంజిత్ రెడ్డి, అజీజా తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : భూభారతి చట్టం వల్ల రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం లింగంపల్లి, బిక్కుమళ్ల గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. లింగంపల్లిలో 132, బిక్కుమళ్లలో 66 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధరణితో పంచాయతీలు పెరిగాయి

- ఎమ్మెల్యే మందుల సామేల్



తుంగతుర్తిలో భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే

తుంగతుర్తి : ధరణి వచ్చాక అన్నదమ్ముల మధ్య, రైతుల మధ్య, రైతులకు అధికారుల మధ్య పంచాయతీలు పెరిగాయని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన ధరణితో అనేక సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. మంగళవారం నాటికి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయని, అలాగే ఈ నెల 20వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వవచ్చని తెలిపారు. ఆగస్టు 15వరకు రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తు ఫారాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, ఎంపీడీఓ శేషు కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, దొంగరి గోవర్ధన్, ఎలగందుల సంజీవ, ఎల్సోజు నరేష్, దాసరి శ్రీను, మల్లేష్, నాగరాజు, రాంబాబు, వెంకన్న పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తుకు పునాది అంగన్‌వాడీ



నూతనకల్: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

తుంగతుర్తి : పిల్లల భవిష్యత్తుకు పునాది అంగన్వాడీ అని ఎంపీడీఓ శేషు కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడెంలో అమ్మఒడి అంగన్వాడీ బాట కార్యక్రమంపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మూడు సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరిని అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తుందని తెలిపారు. పౌష్టికాహారం వల్ల పిల్లలలో ఎదుగుదల వస్తుందని, శారీరక, మానసిక అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అంగన్‌వాడీలలో ఆటపాటలతో కూడిన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శ్రీజ, ఉపాధ్యాయుడు వెంకటమల్లు, పంచాయతీ సెక్రటరీ నాగరాజు, అంగన్వాడీ టీచర్ శారద, ఆయాలు పుష్ప, ఎలేంద్ర, ఆశా కార్యకర్త కొమరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని లక్ష్మాపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.గోపి, తడకమల్ల నాగమల్లయ్య, అంగన్‌వాడీ టీచర్ మల్లేపాక కవిత, ఆశ కార్యకర్త మల్లేపాక శోభారాణి, ఆయా కుంటపల్లి లింగమ్మ పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

నూతనకల్ : తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని డిప్యూటీ తహసీల్దార్ వంశీ, ఎంపీఓ శశికళ అన్నారు. మంగళవారం యడవెల్లి, బిక్కుమళ్ల, తాళ్లసింగారం, సోమ్లాతండా గ్రామాల్లో నిర్వహించిన అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం అనంతారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–3 సెంటర్‌లో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వప్న, పంచాయతీ కార్యదర్శి సోమయ్య, ఏపీఓ రవి, అంగన్‌వాటీ టీచర్ మామిడి వసంత పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : అనంతారంలో..



నాగారం : లక్ష్మాపురంలో..

రుణాలు సకాలంలో చెల్లించాలి

అర్వపల్లి : రైతులు బ్యాంకులో తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించాలని జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐ మేనేజర్ బదావత్ రామకృష్ణ కోరారు. మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో రైతులకు పంట రుణాలపై బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ రుణాలు, పథకాలు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి సురేందర్, సిబ్బంది వెంకటేష్, నర్సింహాచారి, రాజశేఖర్, నరేష్ పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన



రైతులతో అధికారులు, శాస్త్రవేత్తలు

అర్వపల్లి : రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులను సాధించాలని భారతీయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త సీహెచ్. పద్మావతి కోరారు. మంగళవారం మండల పరిధిలోని రామన్నగూడెంలోని రైతు వేదికలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు సమగ్ర సస్య రక్షణ చర్యలను పాటించి ఖర్చు తగ్గించుకోవాలన్నారు. పచ్చిరొట్ట పంటల ప్రాధాన్యత, కలుపు నివారణకోసం పాటించాల్సిన పద్ధతులపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డి. నరేష్, ఇస్కో జిల్లా మేనేజర్ వెంకటేష్, తుంగతుర్తి ఏడీఏ ఎల్ రమేష్‌బాబు, ఏఓ గణేష్, ఏఈఓలు శోభారాణి, సత్యం, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మద్దిరాల : కుక్కడం గ్రామానికి చెందిన కిన్నెర ఉప్పలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. మంగళవారం గ్రామానికి చెందిన జలగం అచ్చయ్యగౌడ్, మద్దెల కాశీం, వల్లపు ఎల్లయ్య, లింగంపెల్లి మల్లయ్యలతోపాటు మరికొంత మంది మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బాధిత కుటుంబానికి రూ.14500 ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మద్దెల భిక్షపతి మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.2516లను అందజేశారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో పాల్గొన్న రామచంద్రయ్య, తదితరులు

తాళ్లగడ్డ (సూర్యాపేట): సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక సభ్యుడు తల్లాడ రామచంద్రయ్య అన్నారు. మంగళవారం స్ప్రెడ్ ఇంటర్నేషనల్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలెంల గ్రామంలో ఏర్పాటు చేసిన హరివిల్లు వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు ఆట వస్తువులు, డ్రాయింగ్ బుక్స్, సైన్స్ ప్రయోగాల ప్రాజెక్టుల కోసం కావాల్సిన వస్తువులను ఉచితంగా అందించిన పటేల్ శ్రీధర్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ వి.దయానంద్, స్ప్రెడ్ సమ్మర్ క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జ్ ఆవుల ప్రసాద్, గ్రామ పెద్దలు కంచర్ల వేణు రెడ్డి, క్యాంపు రిసోర్స్ టీచర్లు మమత, స్రవంతి, అగస్త్య ఫౌండేషన్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గంగదేవమ్మ ఉత్సవాలు



పారువేట ఉత్సవం జరుపుతున్న నిర్వాహకులు, యాదవులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో కొనసాగుతున్న గంగదేవమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పారువేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వేషాలు ప్రదర్శించారు. పారువేట కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, యాదవ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

నాగారం : రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏఈఓ సంధ్య కోరారు. మంగళవారం నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట రైతు వేదికలో రైతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన రైతుల వివరాలను నమోదు చేశారు.

చెరువుమట్టి డంపు పరిశీలన

చివ్వెంల : బి.చందుపట్ల శివారులోని ఊర చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి డంపు చేసిన స్థలాన్ని మంగళవారం తహసీల్దార్ ప్రకాష్‌రావు పరిశీలించారు. కొంత మంది తమ లాభార్జన కోసం చెరువు మట్టిని తవ్వి డంపుగా పోశారు. దీంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.